# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 వరంగల్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 MULUGU JAYASHANKAR BHUPALPALLY




సీతారాం తండాలో విద్యార్థి వీరభద్రంనాయక్‌తో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

# అధైర్యపడకండి అండగా ఉంటాం..

## సీతారాంతండావాసులతో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ) : అధైర్యపడకండి అండగా ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీతారాంతండావాసులకు భరోసానిచ్చారు. మంగళవారం ఖమ్మం జిల్లా నుంచి డోర్నకల్, కురవి మీదుగా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ఇటీవలి వరదలకు కొట్టుకుపోయిన బ్రిడ్జి ముందు రోడ్డును సీఎం పరిశీలించారు. అక్కడున్న అధికారులతో మాట్లాడి, త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత అక్కడినుంచి సీతారాం తండాకు చేరుకొని వరద బాధితులతో మాట్లాడి వారు పడిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

**సీఎం :** అమ్మా మీ పేర్లేంటి?

**బాధితులు :** ఇస్లావత్ మంగీలాల్, నా భార్య పేరు కవిత.

**సీఎం :** మీకు ఏం నష్టం జరిగింది?

**మంగీలాల్ :** అర్ధరాత్రి వరద వచ్చింది. ఇల్లు మొత్తం మునిగిపోయింది. ఇళ్లలోకి నీళ్లు రాగానే డాబాపైకి ఎక్కి కూర్చున్నం. ఆదివారం మధ్యాహ్నం వరకు వరద తగ్గలేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాం.

**సీఎం :** వరద వల్ల మీకు ఏం నష్టం జరిగింది?

**మంగీలాల్, కవిత :** ఇంట్లో ఉన్న అన్ని వస్తువులు కొట్టుకుపోయాయి.

**సీఎం :** ఏమేమి వస్తువులు పోయాయి?

**మంగీలాల్-కవిత :** రూ.80వేల నగదు, మూడు తులాల బంగారం, పాసుపుస్తకాలు, పిల్లల సర్టిఫికెట్స్, పుస్తకాలు, బట్టలు అన్నీ కొట్టుకుపోయాయి. నిత్యావసర సరుకులు అయిన బియ్యం, ఉప్పు, అన్ని రకాల సరుకులు వరద పాలయ్యాయి.

**సీఎం :** ఇప్పుడు మీకు ఏం కావాలి?

**మంగీలాల్-కవిత :** మాకు ఇల్లు ఇక్కడ వద్దు. నీళ్లు రాని కాడ కట్టిచ్చి ఇవ్వండి, ఇక్కడ అసలే ఉండలేం సార్.

**సీఎం :** ఈ ఇల్లు మీ సొంతంగా కట్టుకున్నారా? ప్రభుత్వం ఇచ్చిందా?

**మంగీలాల్-కవిత :** మేమే కట్టుకున్నం సార్.

**సీఎం :** మీకుఎంతమంది పిల్లలు? ఏంచదువుతున్నారు?

**మంగీలాల్-కవిత :** మాకు ముగ్గురు పిల్లలు, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు.

**సీఎం :** ఏం చదువుతున్నారు?

**మంగీలాల్-కవిత :** పెద్ద కూతురు సొనాలిక ఇంటర్ సెకండియర్, రెండో కుమార్తెగాయత్రి 8వతరగతి, కుమారుడు వీరభద్రం నాయక్ 6వ తరగతి చదువుతున్నారు సార్.

**సీఎం :** నీ పేరు ఏంది బాబు.. మంగీలాల్, కవితల కొడుకును అడిగాడు

**వీరభద్ర నాయక్ :** నా పేరు వీరభద్రం నాయక్ సార్.

**సీఎం :** ఏం చదువుతున్నావు నీవు

**వీరభద్రం నాయక్ :** 6వ తరగతి సార్. నా బుక్స్ అన్నీ తడిసి పనికి రాకుండా పోయాయి.

**సీఎం :** ఈమె ఎవరో తెలుసా? (పక్కన ఉన్న సీతక్కను చూపిస్తూ)

**వీరభద్రం నాయక్ :** తెలుసు సార్. సీతక్క.

**సీఎం :** ఈ అక్క నీకు పుస్తకాలు, కాపీలు అన్ని కొనిస్తుంది. నువు బాగా చదువుకో డాక్టర్ కావాలి.

**వీరభ్రభద్ర నాయక్ :** అలాగే సార్.

**సీఎం :** పక్కనే ఉన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను పిలిచి ఈ తండావాసులకు మొత్తం మంచి స్థలం చూసి అందులో ఇందిరమ్మ ఇండ్లు కట్టి ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# వంద మందిని రక్షించిన ఇల్లు



100మందికిపైగా జనానికి ఆసరాగా నిలిచిన నరేందర్ ఇల్లు



ఎస్సై నగేశ్‌తో మాట్లాడుతున్న నరేందర్

కురవి, సెప్టెంబర్ 3 : సీరోలు సెక్షన్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తించే మూడు నరేందర్ ద్వారానే ఆకేరు వాగు నీటి ఉధృతిలో మరిపెడ మండలం సీతారాం తండా మునిగిపోతుందని బయట ప్రపంచానికి తెలిసింది. సీరోలులో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న నరేందర్ స్వగ్రామం సీతారాంతండా. ఆదివారం డ్యూటీలో ఉన్న నరేందర్‌కు తమ్ముడు శ్రీను, అన్న లక్‌పతి తెల్లవారుజామున ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే నరేందర్ సీరోలు ఎస్సై నగేశ్, మరిపెడ పోలీసుస్టేషన్‌కు సమాచారం చేరవేశాడు. తండాకు ఎలా చేరుకోవాలో వారికి వివరించారు. సీరోలు ఎస్సై వెంటనే స్పందించడంతో తండావాసులు బతికిబయటపడ్డారు. ఇకపోతే నరేందర్ సీతారాంతండాలో ఇటీవలే పిల్లర్లు పోసి నాలుగు రూంల స్లాబ్ వేశాడు. ఆదివారం తెల్లవారుజామున చిమ్మ చీకట్లో ప్రళయంలా వస్తున్న వరద నుంచి తమను తాము రక్షించుకునేందుకు చుట్టుపక్కల వాళ్లు నరేందర్ ఇంటిమీదకు చేరుకున్నారు. సుమారు వందమందికిపైగా తండా జనం స్లాబ్‌మీద బిక్కుబిక్కుమంటూ గడిపారు. బ్రిడ్జి నుంచి ఉన్న రోడ్డు కాకుండా తండాకు పై భాగాన బట్టంక చెరువు వైపు రోడ్డు వేయించాలని తండావాసులు ప్రభుత్వాన్ని కోరారు.



సీతారాం తండాకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

# వరద బాధితులను ఆదుకుంటాం..

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా

- సీతారాంతండా, పురుషోత్తమాయగూడెంలో పర్యటన
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు, ప్రతి కుటుంబానికి రూ.10 వేలు
- ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ



మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద తెగిపోయిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రులు

మహబూబాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మూడు రోజుల క్రితం కురిసిన అతి భారీ వర్షాలతో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమై, ప్రాణ, ఆస్తినష్టం జరిగిన నేపథ్యంలో సీఎం మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఖమ్మం జిల్లా నుంచి బయలుదేరిన రేవంత్‌రెడ్డి.. డోర్నకల్, మహబూబాబాద్, కురవి మీదుగా పురుషోత్తమాయగూడెం చేరుకున్నారు. అక్కడ కొట్టుకుపోయిన బ్రిడ్జిని, రోడ్డును పరిశీలించారు. అక్కడున్న అధికారులతో మాట్లాడారు. అక్కడే కొట్టుకుపోయిన యువ శాస్త్రవేత్త అశ్విని ఆమె తండ్రి మోతీలాల్ ఎలా గల్లంతయ్యారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పక్కనే ఉన్న సీతారాంతండాకు చేరుకున్నారు. అక్కడ వరదల్లో మునిగిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అధైర్యపడకండి అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఆ తర్వాత కలెక్టరేట్‌కు వెళ్లారు. వరద నష్టంపై అక్కడ జిల్లా పౌర సంబంధాల అధికారి ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. వరద నష్టంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చేయాల్సిన పనులు త్వరగా పూర్తిచేయాలని, రోడ్ల మరమ్మతు పనులు తాత్కాలికంగా పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి రూ.10 వేలు అందిస్తామని, జిల్లాలో వరదలతో ఇద్దరు మృతిచెందారని, చనిపోయిన కుటుంబానికి ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం అందిస్తామని ప్రకటించారు. సీతారాంతండాతో పాటు మరో రెండు తండాలకు ఒకే చోట ప్రభుత్వం స్థలం ఇచ్చి అం దులో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇ చ్చారు. వరదతో జిల్లాలో 30వేల ఎకరాల్లో పం ట నష్టం జరిగిందని, దెబ్బతిన్న పంటలకు ప్రతి ఎకరానికి రూ.10వేలు పరిహారం అందిస్తానని ప్రకటించారు. పశు నష్టం, పంట నష్టం ఇతర వాణిజ్య పంటల నష్టంపై ప్రత్యేక సర్వే నిర్వహించి పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చా రు. ఆకేరు వాగు పొంగి ఇండ్లలోని పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డులు, సర్టిఫికెట్లు తడిచిపోయినందున ఒకే ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసి అందరికీ కొత్త కార్డులు, సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆకేరు ప్రవాహం నీటి నియంత్రణపై శాస్త్రీయంగా అంచనా వేసి కొత్త వంతెన నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 30వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. 680మందికి పునరావాసం కల్పించామని సీతారాంతండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలిచిన ఎస్సై నగేశ్‌కి అభినందనలు తెలిపారు. సమీక్షలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రూనాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ వరద నష్టం రూ.కోటీ 50 లక్షలు

**మహబూబాబాద్‌కు బస్సుల నిలిపివేత**

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3 : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి వరదలు, వాగులు పొంగిపొర్లుతుండటంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ఆర్టీసీకి నష్టం వాటిల్లింది. మహబూబాబాద్‌తో పాటు వరదలు వస్తున్న ఆయా రూట్లలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా బస్సులను నిలిపివేశారు. మహబూబాబాద్-ఖమ్మం, తొర్రూరు, కేసముద్రం వైపు బస్సులను నిలిపివేయగా సుమారు 16 బస్సులు రద్దు చేశారు. భారీ వర్షాలతో మూడు రోజులకు రూ.కోటీ 50 లక్షల ఆదాయం నష్టపోయినట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు.

### వరద బాధితులకు నేను సైతం..

**సీఎం సహాయనిధికి రూ.3వేలు అందించిన బాలిక**



మహబూబాబాద్ రూరల్ : వరద ముంపు బాధితులను ఆదుకోవాలనే ఆలోచనతో తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయనిధికి అందిస్తున్న పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు. ఈ సందర్భంగా సీఎం సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ బాలికను అభినందించారు.

### సీరోలు ఎస్సై పుణ్యమాని బతికిన..



కురవి, సెప్టెంబర్ 3 : నాకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. అందరి పెండ్లిళ్లు చేసినం. మా పక్క ఇంట్లో రెండో కొడుకు భీముడు ఉంటాడు. నాకు కాళ్లు విరిగి అతుక్కొని నడిచే సమయంలో ప్రమాదవశాత్తు కుడికాలుపై వేడినీళ్లు పడ్డాయి. మళ్లీ మంచానికే పరిమితమయ్యాను. మా ఆయన బీక్యాకు నరాల నొప్పులు. పోయిన శుక్రవారం (ఆగస్టు 30న) వరంగల్‌లోని దవాఖానకు వెళ్లి వచ్చాడు. మా ఇల్లు తండా ప్రారంభంలో ఆకేరు వాగుకు సమీపంలో ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున కరెంటు లేదు. నీళ్లు వస్తున్నాయని మా ఆయన చెప్పడంతో బయటకు వెళ్లేందుకు తలుపు తీశాం. సముద్రంలో ఉన్నట్లుగా నీళ్లు నెట్టేశాయి. మా ఆయన, నేను ఇద్దరం మా గది నుంచి ఇంటి ముందు చెట్టు వరకు కొట్టుకుపోయాం. అదే సమయంలో భీముడు చూసి ముందు నన్ను, తర్వాత మా ఆయనను తీసుకొని డాబాపైకి చేర్చాడు. 10 గంటలు నరకం చూశాం. బతికుంటామనే ఆశ లేదు. ఎలాగో సమాచారం అందుకున్న పోలీసులు తండాను ఖాళీ చేయించిన తర్వాత చివరగా మా ఇంటికివచ్చారు. సీరోలు ఎస్సై పుణ్యం.. జోలె కట్టి.. నన్ను మోసుకుంటూ రోడ్డు వరకు తీసుకుపోయిండు. నిజంగా ఆ సార్ దేవుడు. మా ఇంటి నుంచి రోడ్డు సుమారు కిలోమీటరు ఉంటది. అది కూడా నాటువేసిన వరిపొలాలు...నిండా నీళ్లు. అందులో నుంచే తీసుకుపోయిండు. దేవుడి దయతో సార్ చల్లంగా ఉండాలి.

**– గుగులోత్ ద్వాలీ, సీతారాంతండా, మరిపెడ**



కురవి: గుగులోత్ రవి, వాళ్ల అన్న ప్రకాశ్ కుటుంబం

### పగోడికి కూడా మా కష్టం రావొద్దు

కురవి, సెప్టెంబర్ 3 : ఆదివారం వచ్చిన వరద జీవితంలో మళ్లీ చూడం. శనివారం రాత్రి వర్షం పడుతుండడంతో కరెంటు పోయింది. అందరం వరండాలోనే నిద్రపోయాం. తెల్లవారుజామున 2గంటల సమయంలో మేకలు, గొడ్లు అరుస్తుంటే ఏమైందనుకొని నిద్రలో నుంచి లేచి చూశాం. ఏం జరుగుతుందో తెలిసే సరికే నీళ్లు పెరిగిపోతున్నాయి. పై భాగాన ఉన్న ఇంట్లో అన్న ప్రకాశ్, వదిన కవిత, పాప పడుకున్నారు. కింద భాగాన ఉన్న ఇంట్లో నేను నా భార్య నీల, ఇద్దరు కుమారులు, అనారోగ్యంతో బాధపడుతున్న అమ్మ బాలి పడుకున్నాం. కళ్లు మూసి తెరిచే సరికి నడుము వరకు నీళ్లు వచ్చాయి. అమ్మను తీసుకువెళ్లి పక్కనే ఉన్న మా బాబాయి ఇంటి మీదకు చేర్చి పిల్లలను తీసుకుని వెళ్లే సరికి కిందకు వచ్చే పరిస్థితి లేదు. తెల్లవారుజామున 3 గంటలకు ఎక్కిన డాబా దిగేసరికి 11 గంటలైంది. ఎనిమిది గంటలు నరకయాతనే. పోలీసులు, లచ్యాతండావాసులు మమ్ముల్ని కాపాడారు. ఆ సమయంలో నిద్రలో నుంచి మెళకువ రాకపోయి ఉంటే ఎనిమిది మందిమి శవాలుగా మారేటోళ్లం. ఇటువంటి కష్టం పగోడికి కూడా రావొద్దు. ప్రభుత్వం స్పందించి తండాను ఖాళీ చేయిస్తేనే మా పిల్లలకు భవిష్యత్ ఉంటుంది. తినేందుకు తిండి గింజలు లేవు. రెండు దుక్కిటెద్దులు నీళ్లలో పోయాయి. 10 శాల్తీల మేకలు కొట్టుకుపోయాయి. పంట పొలాలను చూసేందుకు మనసు రావడం లేదు. బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నం.

**– గుగులోత్ రవి, సీతారాంతండా, వ్యవసాయ రైతు**

# సీఎం డౌన్ డౌన్ అన్నది బాధితులే..

- ప్రతిపక్షాలపై దాడి చేసింది కాంగ్రెస్ గూండాలు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పుల, సెప్టెంబర్ 3 : ఖమ్మం వరదల విషయంలో ప్రభుత్వం తీరు రోమ్ నగరం తగలబడుతుంటే రాజు ఫిడేలు వాయించుకుంటూ కూర్చున్న చందంగా ఉందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎద్దేవా చేశారు. ఖమ్మం వరద విలయం చూడడానికి, బాధితులను ఆదుకోవడానికి మంగళవారం బీఆర్ఎస్ నాయకులు వెళ్తే వారిపై కావాలని కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మంలో ముగ్గురు మంత్రులుండీ చేసిందేమీ లేదని వరద ప్రాంతాల్లో పర్యటించిన వారిని బాధితులే తరిమిన దాఖలాలున్నాయని, అడుగడుగునా నిలదీసిన సందర్భాలున్నాయన్నారు. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించిన నేపథ్యంలో సీఎం డౌన్ డౌన్ అనే నినాదాలు వినిపించాయని, ఇదంతా ప్రభుత్వ అసమర్థత అని గమనిస్తే బాగుండేదన్నారు. వరద బాధితులను ఆదుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఆ పనిచేద్దామని వెళ్తే గూండాలతో దాడులు చేయించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, పువ్వాడ, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్లపై దాడులు చేయడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. ఈ దాడిపై ముఖ్యమంత్రిలో పాటు మంత్రులు, కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని, నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు.

# రావిరాలను పట్టించుకోని సీఎం

- అక్కడి ప్రజలను పరామర్శించకపోవడం దారుణం
- అధికారులు ముందస్తు చర్యలు తీసుకోలేదు
- విపత్తు సమయంలోనూ కాంగ్రెస్ రాజకీయం
- మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 : వరదతో భారీగా నష్టపోయిన రావిరాల గ్రామాన్ని పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. అక్కడి ప్రజలు తమ బాధలను సీఎం తీరుస్తాడని ఎదురు చూశారని, వారిని పరామర్శించకుండా వెళ్లిపోవడం దారుణమన్నారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి హడావిడిగా పర్యటించారని, ఇక్కడ అనేక చెరువులు తెగి పలు గ్రామాలు నీట మునిగాయని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోక పోవటం వల్ల నష్టం జరిగిందన్నారు. అధికారులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వర్షాల వల్ల నష్టపోయిన ప్రాంతాలను సందర్శించకపోవడం దారుణమన్నారు. ముంపునకు గురైన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం ఇంత వరకు ఎవరూ చేయలేదన్నారు. ఆలేరు గ్రామంలో పెద్ద చెరువుకు గండి పడి 48 గంటలైనా ఒక్క అధికారి కూడా రాలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టంపై సర్వే చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు వెళ్తే కొంత మంది కాంగ్రెస్ గూండాలు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. విపత్తు సమయంలో కూడా కాంగ్రెస్ రాజకీయం చేస్తున్నదని, బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతిదాడి చేస్తే ఆ పార్టీ నాయకులు ఒక్కరూ తిరగరని అన్నారు. ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాలను సర్వే చేయించి ఎకరాకు రూ. 30 వేలు పరిహారం అందించాలన్నారు. ఇల్లు ధ్వంసమైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించి ఇవ్వాలని, గొర్రెలు, మేకలు కోల్పోయిన వారికి తగిన పరిహారం అందించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, బీఆర్ఎస్ నాయకులు లునావత్ అశోక్ నాయక్, గోగుల రాజు, దాము నాయక్, బాలు నాయక్, రామచంద్రు, వెంకటరెడ్డి, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గూండాల దాడి హేయం

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



జనగామ, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఖమ్మం వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు తోడుగా వెళ్లిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు బృందంపై కాంగ్రెస్ పార్టీ గూండాల దాడి అత్యంత హేయమని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆపత్కాలంలో ప్రజలకు సహాయంగా, బాధితులకు అండగా ఉండకుండా సాయం చేస్తున్న వారిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల బృందంపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. సహాయం చేస్తున్న వారిని అడ్డుకోకుండా ప్రభుత్వం వరద బాధితులను వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్యే పల్లా డిమాండ్ చేశారు.

### ఆపత్కాలంలో ప్రతిపక్షాలపై దాడులా?

**బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం**



హనుమకొండ, సెప్టెంబర్ 3 : ప్రజాసేవ చేయాల్సిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై దాడులు చేయడమేమిటని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో భారీ వర్షం, వరదలతో నీట మునిగిన కాలనీలు, ఇబ్బంది పడుతున్న ప్రజలను పరామర్శించి అండగా నిలిచేందుకు వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ గూండాల దాడిని ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఖమ్మం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజల కష్టాల్లో తోడుగా ఉంటున్నారని అక్కసుతోనే దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రజలకు ఆపత్కాలంలో అండగా ఉండలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. ప్రజలు ఎప్పుడూ క్షేమంగా ఉండాలని బీఆర్ఎస్ కోరుకుంటుందని పేర్కొన్నారు. గతంలో వరదలు, విపత్తులను కేసీఆర్ సర్కార్ సమర్థవంతంగా ఎదుర్కొన్నదని దాస్యం గుర్తుచేశారు.

# కుడా విస్తరణకు కసరత్తు

- 2800 చదరపు కిలోమీటర్లు పెంచేందుకు ప్రణాళికలు
- జీపీలకు సర్క్యులర్ల జారీ
- వ్యతిరేకిస్తున్న గ్రామ పంచాయతీలు




వరంగల్, సెప్టెంబర్ 3 : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) విస్తరణకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఆదాయ మార్గాలు పెంచుకోవాలన్న ఆలోచనలతో ప్రభుత్వం కుడా పరిధి విస్తరణకు పచ్చ జెండా ఊపినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం కుడా పరిధి 1805 చదరపు కిలోమీటర్లు ఉండగా, దానిని 2800 చదరపు కిలోమీటర్లకు పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం కుడా పరిధిలో వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని 19 మండలాలు,181 గ్రామాలుండగా, పరకాల, భూపాలపల్లి, నర్సంపేట జనగామ పట్టణాలతో పాటు కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్‌ను కూడా తీసురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

**జీపీలకు సర్క్యులర్లు**

కుడాలో విలీనానికి అనుకూలంగా తీర్మాణాలు చేసి పంపించాలని గ్రామ పంచాయతీలకు కలెక్టర్ కార్యాలయం నుంచి సర్క్యులర్లు జారీ అయ్యాయి. హుస్నాబాద్, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, జనగామ ఎమ్మెల్యేలకు కూడా విస్తరణపై సమాచారం ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని భీమదేవరపల్లి మండల కేంద్రంతో పాటు మాల్లారం, కొత్తకొండ, ముస్తఫాపూర్, గట్ల నర్సింగాపూర్, వంగర, రత్నగిరి, కన్నారం, మాణిక్యాపూర్, పరకాల పట్టణంతో పాటు రాజిపేట, కామారెడ్డిపల్లి, మాదారం, వెల్లంపల్లి, పోచారం, మల్లక్కపేట గ్రా మాలకు సర్క్యులర్లు జారీ అయ్యాయి. అలాగే ఆత్మకూరు మండలంలోని కామారం, పెంచికలపేట్, నీరుకుళ్ల, బ్రాహ్మణపల్లి, దామెర మండలంలోని సర్వాపూర్, కంఠాత్మకూర్, కౌకొండ, నడికూడ మం డలం కేంద్రంతో పాటు ధర్మారం, రాయపర్తి, ముస్త్యాలపల్లి, శాయంపేట మండల కేంద్రంతో పాటు పత్తిపాక, సింగారం (కొత్త గట్టు), హుస్సేన్‌పల్లి, మైలారం, పెద్దకోడెపాక, తహరాపూర్, గట్లకానిపర్తి, ఐనవోలు మండలంలోని నందనం, కక్కిరాలపల్లి గ్రామాలకు కూడా జారీ చేశారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్ణణంతో పాటు చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లోని గ్రామాలు సైతం కుడా పరిధిలోకి రానున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలోని జఫర్‌గడ్, లింగాలఘనపూర్ మండాలలను కుడా పరిధిలోకి తీసుకురానున్నారు. జనగామ పట్ణణంతో పాటు జనగామ రూరల్ ప్రాంతాలను కలిపేందుకు ఇప్పటికే సర్క్యులర్లు జారీ ఆయ్యాయి. కాగా, కుడా పరిధిని విస్తరిస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరగనుంది. అయితే కుడా పరిధిలోకి వెళ్తే తమ ఆదాయం తగ్గిపోతుందని విలీనాన్ని జీపీలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీల కాల పరిమితి ముగియడంతో విలీనం చేయడం ప్రభుత్వానికి సులువుగా మారింది.

# వ్యవసాయ శాస్త్రవేత్తలకు అవార్డులు

- విత్తనోత్పత్తిలో విశేష కృషికి దక్కిన గౌరవం
- వ్యవసాయ కళాశాలకు ఉత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న డీన్ డాక్టర్ బలరాం

కాశీబుగ్గ, సెప్టెంబర్ 3: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో అపరాల విభాగంలో పనిచేస్తున్న శాస్త్రవేత్త ఎన్ సంధ్యాకిశోర్, మండవ వెంకట్రామయ్య ఉత్తమ శాస్త్రవేత్తలుగా అవార్డులు అందుకున్నారు. అలాగే, కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ ఓంప్రకాశ్ ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ భూక్యా రమేశ్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ ముగ్గురు హైదరాబాద్‌లోని పీజీటీఎస్ ఏయూ రాజేంద్రనగర్ ఉపకులపతి ప్రొఫెసర్ బీజేరావు, పీజీటీఎస్ఏయూ వీసీ ఎం రఘునందన్‌రావు చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. వీరికి అవార్డులు రావడంపై వరంగల్ ఏడీఆర్ డాక్టర్ రావుల ఉమారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే, వరంగల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాలకు ఉత్తమ కళాశాల అవార్డు లభించింది. ఈమేరకు కళాశాల డీన్ బలరాం పురస్కారం అందుకున్నారు.